కథ

# గోడమీద మేకు

''ఛీ...వెధవబ్రతుకు''

ఆ స్థితిలో రాజాని చూసి నాకనిపించింది. మరో ప్రక్కకి ముఖం పెట్టి ఇంటి ముఖం పట్టాను.

''సార్..సార్'' అని పిలవడంతో వెనక్కి తిరిగి చూశాను. ఆటో డ్రైవర్ సత్యం.

''కృష్ణబాబూ..రాజాగారు నిన్నటి నుంచి ఇలాగే ఉన్నారు బాబూ..మేమెంత చెప్పినా వినట్లేదు. ఇంటికి తీసు కెళ్తానంటే రానంటారు. మీరైనా తీసుకెళ్ళండి బాబూ''

నిజానికి నేనాక్షణం వరకూ ఇంక వాడి గురించి పట్టించుకోవాలనుకోలేదు. కానీ వాడి అమాయకమైన ముఖం, వాడి మంచి మనసు, ఊర్లో వాడి మీద అందరికీ ఉన్న అభిమానం నా నిర్ణయాన్ని మార్చాయి.

బజార్లో నడిరోడ్డు మీద అడ్డంగా పడి ఉన్నాడు రాజా.

పట్టపగలు విపరీతంగా తాగడం వల్ల నిషా ఎక్కువై లోకంతో సంబంధం లేకుండా పడున్నాడు. ఇప్పటికి చాలా సార్లు చెప్పాను. ఆ అలవాటు మానుకోమని. వాడికి అలవాటు లేకపోతే మచ్చలేని పున్నమిచంద్రుడు. వాడంతగా మానుకోలేనట్లైతే ఇంటి దగ్గరే కానివ్వు అని చాలాసార్లు చెప్పాను. అది నేనెవ్వకూడని సలహా అయినప్పటికీ వాడి బుర్రకెక్కడం లేదు.

రోడ్లమీద తాగి పడిపోవడం-ఎవరో ఒకరు ఇంటికి తీసుకురావడం.

వాడి భార్య స్వర్ణ వచ్చి మొరపెట్టుకుంటుంది. వాడు నా మేనల్లుడు కావడం చేత, నేను మందలిస్తానని.

దెబ్బలాడతాను. విన్నట్టే కనిపిస్తాడు. కొన్నాళ్ళు తాగుడుకి దూరంగా ఉంటాడు-మళ్ళీ మామూలే. ఇప్పటికిలా నాలుగైదుసార్లు జరిగింది. సత్యం రాజాని ఆటో ఎక్కించాడు. ఈసారి ఆటో ఎక్కననలేదు, నిషాలో కూడా నన్ను గుర్తుపట్టబట్టి. ఇంటి దగ్గర వాడిని మంచం మీద పడుకోబెట్టి స్వర్ణని పిలిచి చెప్పాను-

''వాడితో వాదించకు''

స్వర్ణ నాకు అన్నయ్య కూతురే. ఇద్దరూ దగ్గరవాళ్ళే. నావెనుకే వచ్చిన స్వర్ణ ఏడుస్తూ అడిగింది-

''ఈయన మరి మారరా చిన్నాన్నా?''

ధైర్యం చెప్పాను. కానీ ఎక్కువగా మాట్లాడలేదు. నా మనసు మనసులో లేకపోవడంతో. సత్యానికి డబ్బులిచ్చి పంపేసి ఇంటి ముఖం పట్టాను. అక్కడికి నాలుగో ఇల్లేమాది.

ఇంటికెళ్ళిన వెంటనే సీత అడిగింది- ''భోజనం చేద్దురుగాని రండి''

''చేసేశాను కడుపునిండా. మీ చిన్నన్నయ్య పెట్టాడు'' చెప్పి బట్టలు కూడా మార్చుకోకుండా పడుకున్నాను. సీత నాకు అక్క కూతురే. మేనకోడల్నే చేసుకున్నాను. రాజా దానికంటే పైవాడు. మనిషి వ్యక్తిగతంగా చాలా మంచివాడు. చక్కటి సాహిత్యాభిలాష ఉన్నవాడు.

గవర్నమెంటు ఉద్యోగి. మా అన్నయ్య కూతుర్నే ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. తల్లిదండ్రులకి భారం తగ్గించడానికి తన భార్యతో వేరు కాపురం పెట్టాడు. ఇదివరలో ఈ పాడు అలవాటు లేనప్పుడు పత్రికల్లో వాడి కథలు చాలా చోటుచేసుకున్నాయి. మంచి రచయితగా గుర్తింపు వస్తున్న సమయంలో ట్రాక్ మారాడు.

స్వర్ణంటే వల్లమాలిన అభిమానం, ప్రేమ ఉన్నాయి. వాడికిద్దరూ మగపిల్లలే. అందం-ఆరోగ్యం-తెలివితేటలు ఉన్న వాడి పిల్లల్ని చూస్తే జాలివేస్తుంది. తను కష్టపడైనా ఇతరులని సుఖపెట్టే మన స్తత్వంవాడిది. బహుశా అక్కడే ట్రాక్ మారాడు రాజా. మంచి మనసున్న వాళ్ళని మనుషులుగా బ్రతకనివ్వదు సంఘం. తాము చెడిపోయినా పర్వాలేదు, పక్క వాడు బాగుపడకూడదు అన్న సిద్ధాంతం ఉన్న స్నేహితులు చేరారు వాడిప్రక్క.

'నీ స్నేహితులు ఎలాంటివారో చెప్పు. నువ్వెలాంటివాడివో చెప్తాను' అన్న ఇంగ్లీషు సామెత వాడిలాంటి వారిమీద పుట్టిందే.

''చదువు సంధ్య లేని వాళ్ళు, పనీ పాటూ లేని వాళ్ళు వాడి చుట్టూ మూగుతున్నారు. జీతాలరోజు ఆటోలో వెళ్తాడు. జీతం అందుకుని అటునుంచి అటే బార్‌లకీ, వైన్ షాపుల కీను. ఇంటికి కావలసిన సరుకులు కూడా తేవటం లేదుట. పక్కింటి ఆడిటర్ కూర్మారావుగారు చెప్పారు. వాడు ఇప్పటికే రెండు చార్జ్‌షీట్స్ అందుకున్నాడు. ఇంకొకటిస్తే వాడు ఖచ్చితంగా నిరుద్యోగి అవుతాడు.

జాలి మనసున్న రాజా ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండేవాడు. అదే అలుసుగా ఏవేవో కాకమ్మ కథలు చెప్పి వాడిచేత అప్పులు కూడా చేయించి డబ్బు స్వాహా చేసేస్తున్నారు.

'సిరి అబ్బకపోయినా-చిడుం అబ్బుతుంది' అన్నట్లుగా తాగుబోతని ముద్రపడింది, మా బంధువర్గంలో.

ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్రపట్టిందో తెలియలేదు.

సాయంత్రం సీత కాఫీతో వచ్చి నిద్రలేపింది.

''ఏంటండీ..భోజనం కూడా చెయ్యలేదు''

గోడగడియారం వైపు చూసాను. ఐదు దాటుతోంది. లేచి కూచుని కాఫీ అందుకుంటూ అన్నాను-

''కొంచెం మనసు చికాగ్గా ఉంటే అలాగే పడుకుండిపోయాను''

''అన్నయ్య వల్లేనా?'' అడిగింది సీత.

''అవును'' అన్నాను.

''మీరు ఎక్కువగా బాధపడేది మా అన్నయ్య గురించేనని నాకు తెలుసు. మీ ఇద్దరి మధ్యా రక్తసంబంధం కంటే స్నేహబంధమే ఎక్కువ.''

''ఆ స్వర్ణని చూస్తే ఏడుపొస్తోంది. వాడిని ఎలా మార్చడమో అర్థంకావడం లేదు. ఇప్పటికే సంసారం వీధినపడింది. ఎన్నిసార్లని దెబ్బలాడతాను'' చెప్పాను మళ్ళీ వచ్చేస్తున్న ఇరిటేషన్‌ని అపుకుని.

''అదే చెప్తున్నాను. ఎక్కువగా ఆలోచించకండి. కొన్ని సమస్యల్ని కాలమే పరిష్కరిస్తుంది'' నా మనసెరిగిన సీత శాంత పరచడంతో లేచి బాత్‌రూంలోకి నడిచాను.

★★★

ఆరోజు ఉదయం నేను స్నానం చేసి వచ్చేసరికి చిన్నన్నయ్య కొండమీద నుంచి తెచ్చిన ప్రసాదం తింటున్నారు పిల్లలు.

నాకు కూడా ఒక ప్లేట్‌లో పెట్టి పిలిచింది సీత.

స్నానం చేసిన వెంటనే ప్రతిరోజూ సుందరకాండ లోని పట్టాభిషేకం చదువుకోందే నేనేపనీ చెయ్యను. పారాయణ చేసుకుని వచ్చి ప్రసాదం తింటుండగా వచ్చాడు రాజా.

రోజూ మా ఇంటికి వస్తాడు. పిల్లల్ని-మా అమ్మని-మా వదినగార్ని- మా అన్నయ్య పిల్లల్నీ అందర్నీ ఒకసారి చూసి పలకరించి వెళ్తాడు.

కోపంగా ఉండటం చేత వాడిరాకని పట్టించుకోలేదు. ప్రసాదం తింటున్నాను.

''ఏం మావయ్యా! ఇంకా ఆఫీసుకి వెళ్ళలేదా?'' పలకరింపుగా అడిగాడు.

వాడిమాటకి జవాబివ్వలేదు. వాడి ముఖం లోకి చూసి ఊరుకున్నాను.

''అన్నయ్యా రా..ప్రసాదం తిందువుగాని, చిన్నమావయ్య తెచ్చారు'' సీత పిలిచింది.

''వద్దమ్మా'' నిరాకరించాడు.

''వాడికి భక్తి-ప్రసాదం ఎందుకే? నువ్వు పొయ్యగలవా చెప్పు..బ్రాందీయో, విస్కీయోపోస్తే గడగడా తాగేసి దొర్లుతాడు'' కోపం అణుచుకోలేక బయటపడ్డాను.

''సారీ మావయ్యా..నిన్న'' రాజా అంటున్న మాటలకి మధ్యలోనే అడ్డుపడ్డాను. ''దయచేసి ఇంకేం చెప్పకురా. నీ గురించి నువ్వు మరిచిపోయావు. నీ పరిధులు దాటిపోయావు. నువ్వూ నీ తల్లిదండ్రులు ఎలాంటివారు? నీ వంశం ఎలాంటిది అన్న సంగతి మరిచిపోయావు. నీ మావయ్య అప్పలాచార్య స్వామివారు రామాయణం చెప్పడంలో దిట్ట. ఆయన ఉపన్యాసం చెబితే ఒళ్ళూపై తెలియకుండా కాలం మరచిపోయి అందరూ కదలకుండా వింటారు. ఆయన రాసిన సుందరకాండ తత్వదీపిక ఎన్ని కాపీలు అమ్ముడైనా ఇంకా అచ్చుకోరుకుంటూనే ఉంది. నీ మేనమామ అదే మా చిన్నన్నయ్య చేత సింహాద్రప్పన్నకి అలంకారం చేయించుకోవడం ఇష్టం. వాడి ఆధ్వర్యంలోని కళ్యాణాలే నిత్యం చేయించుకుంటాడా స్వామి. అలాంటిది నువ్వేంటో తెలుసుకోకుండ పరిస్థితులు మరిచిపోతున్నావు. ఒకానొకప్పుడు రచయితవు కదా? ఆ విజ్ఞత ఏమైంది?'' కోపంగా అన్నాను.

''నిజమే మావయ్యా..నాది తప్పే. కానీ ఆ క్షణంలో యుక్తాయుక్తాలు మరిచిపోతాను. మానేయాలన్న దృఢసంకల్పం ఉంటే సాధించగలను. ఆ విధమైన పట్టుదల మీద సంపాదించుకున్నవే నా జీవితంలో అన్నీ. నీకు తెలుసు కదా?''

''అవునురా, అందుకే అడుగుతున్నాను. ఆ సంకల్పానికి అంకురార్పణ ఏం చెయ్యలేకపోతున్నావు?''

వాడి సంగతేదో తెలుసుకుందుకే ఆరోజు నిర్ణయించుకు న్నాను.

''మానేయాలన్న నా సంకల్పాన్ని, నా పరిస్థితులు డామి నేట్ చేస్తున్నాయి. నీకు తెలిసిందే, నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ చేశాను కదా? అప్పుడే ఈ మహ మ్మారి నన్ను పట్టుకుంది. అయితే దీనికి కారణం స్వర్ణ కూడా.''

''వ్వాట్?''

వీడి తాగుడుకి స్వర్ణకీ ఏమిటి సంబంధం?


''అవును మావయ్యా! మీరు త్రాగుడు మానకపోతే నేను వెళ్ళిపోతాను, చచ్చిపోతాను అని నన్ను సాధించి మరింత నన్ను తాగడానికి ప్రోత్సహిస్తుందే తప్ప నా పరిస్థితుల్ని అర్థం చేసుకుని నన్ను మార్చడానికి ప్రయత్నించదు. నాకు స్వర్ణా-పిల్లలూ అంటే ఎంత ప్రేమో నీకు తెలుసు. ఈరోజు తాగకూడదు అని ఏరోజయితే నేనింటికొస్తానో ఆరోజే ఇంట్లో ఏదో గొడవ అవుతుంది. అయితే స్వర్ణ అలా తయారవడానికి కారణం లేకపోలేదు. నా నుంచి ఎంతో ఆశించి నన్ను పెళ్ళి చేసుకుంది. నేను కూడా ఊహించాను, మనవాళ్ళలోకెల్లా ఆదర్శ దాంపత్యం మాదవుతుందని. కానీ నా జీవితంలోకి సమస్యలెలా వచ్చాయో నాకే తెలీదు. ప్రస్తుతం సమస్యే నా జీవితమయిపోయింది. చదువుకున్న స్వర్ణతో నా జీవితం సుఖంగా సాగిపోతుందనుకున్నాను. కానీ దానికి సంసారానికి పనికొచ్చే తెలివితేటలు లేవు'' ఈ విధంగా చెప్తుంటే రాజా గొంతు గద్గదమయింది. ''రాజా'' అన్నాను ఆర్తిగా. వాడి మనసులో ఇంత ఆర్ద్రత ఉందని తెలుసుకోలేకపోయాను. మళ్ళీ చెప్పసాగాడు.

''ఆ మధ్య నాకు ఏక్సిడెంట్ అయింది గుర్తుందా? నాకు ఏక్సిడెంట్ అయినప్పుడు స్వర్ణ ఊర్లోలేదు. ఈ విషయం తెలుసుకుని వచ్చిన స్వర్ణ నా బెడ్ దగ్గర అన్న మొదటి మాట ఏమిటో తెలుసా? ''తాగి డ్రైవ్ చేయద్దని ఎన్నిసార్లు చెప్పాలి మీకు'' అని. నిజానికి నేను ఆ రోజు తాగలేదు. అనుమానం ఉంటే నన్ను ట్రీట్ చేసిన డాక్టర్‌ని అడుగు. నా స్కూటర్ అమ్మేశాను కదా! అన్నయ్య బైక్ తీసుకున్నాను. ఇంటి దగ్గర బయలుదేరుతున్నప్పుడు కుక్క ఒకటి అడ్డుగా రావడంతో నేను వేసిన సడన్ బ్రేక్‌కి బండి ఇసుకలో స్కిడ్ అయింది. తలకి చిన్నరాయి తగిలింది నేను పడిపోవడం వలన. అయితే అప్పుడు నేనేం పట్టించుకోలేదు పైకి రక్తం రాకపోవడంతో. కానీ ఆ దెబ్బ వలన నేను మళ్ళీ వెళ్తున్నప్పుడు నాకు తెలియకుండానే తెలివి తప్పాను. ఇదంతా నేను ఎవరికి చెప్పినా నమ్మరు. ఎందుకంటే నేను తాగుబోతుని కదా! ఎవరో పుణ్యాత్ములు నన్ను కంపెనీ హాస్పిటల్‌లో చేర్చి, మా కొలీగ్స్‌కి చెప్పడంతో నేను బ్రతికి బయటపడ్డాను.''

ఆ మాటలు విన్న నేను కూడా ఏం మాట్లాడలేకపోయాను. ఎందుకంటే నేను కూడా వాడు ఓవర్‌గా తాగినందు వల్లే పడిపోయాడని అనుకున్నాను కాబట్టి.

''ఇంకో విషయం చెప్పనా?...ఈ మధ్య స్వర్ణ వంట చేస్తూ చెయ్యి కాల్చుకుంది. దానికి మా చుట్టుప్రక్కల ప్రచారం ఏంటో తెలుసా? నేను తాగొచ్చి వాతలు పెట్టానని''

ఎప్పుడు నా ఎదుట పడినా అంత మాట్లాడడు రాజా. కానీ ఆ రోజువాడి మనసు బయటపెట్టడంతో నేను మౌనంగా వాడికి మాట్లాడడానికి అవకాశమిచ్చాను.



''రెండు వారాల క్రితం బజార్లో ఒక గొడవ జరిగింది. గొడవ పడుతున్నది ఎవరో కాదు. మా పిన్ని కొడుకు సుదర్శనం. వాడి మీద పెద్ద గొంతుతో కేకలు వేస్తున్నది, వడ్డీవ్యాపారి రవి. సుదర్శనం రవికి డబ్బులివ్వాలిట. అందరూ వింత చూస్తున్నారు. ఎవరూ సర్దిచెప్పడం లేదు. నేను ఊరుకోలేక ''ఇచ్చేస్తాడు రవీ! వాడికి రావలసిన ఎమౌంట్ ఉంది'' అని రవితో చెప్పేను. దానికి రవి ఏమీ మాట్లాడలేదు. కానీ సుదర్శనం ఏమన్నాడో తెలుసా? 'నువ్వీమూడ్‌లో ఏం మాట్లాడకురా' అని. కారణం-నేను తాగుబోతునని. ఎవరికోసం? ఎవరి కోసం నేను తాగుడు మానాలి. మానేసినా నన్నేం నమ్మలేదు ఈ లోకం. అందుకే...అందుకే...నన్ను నేను హింసించుకుంటున్నాను.''

కొద్ది క్షణాలు నేనేం మాట్లాడలేదు. వాడి బాధని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. కానీ వాడి సమస్యకి పరిష్కారం అది కాదు. అలావాడు కంటిన్యూ అయితే ఖచ్చితంగా ఊబిలో కూరుకుపోయినట్లే. అందుకే వాడితో అన్నాను.

''ఆదర్శాలు వల్లె వేయడానికి బావుంటాయి కానీ, ఆచరణ సాధ్యం కాదు. లోకులు కాకులు. నీకు తెలుసో తెలియదో కానీ, నేను ఓ కథ చెప్తాను విను. ఆ కథ నీ జీవితానికి చాలా ఉపయోగపడుతుంది.

ఒక ఊర్లో చాలా నెమ్మదస్తుడైన, మంచి గుణవంతుడైన ఒక రైతుకి పుట్టినబిడ్డ జులాయిగా తిరుగుతున్నాడు. ఆ రైతుకి వాడిని ఎలా దారిలోకి తీసుకురావాలో అర్థం కాలేదు. ఆ కుర్రాడు చిల్లర దొంగతనాలకి కూడా అలవాటు పడడంతో రైతు తనలో తనే కుమిలిపోయేవాడు. ఆ రైతు తన కొడుకు దొంగతనం చేసినప్పుడల్లా ఒక్కొక్క మేకుని గోడపై కొడుతుండేవాడు. కొన్నాళ్ళ తర్వాత దైవ సంకల్పంతో ఆ కుర్రాడిలో పరివర్తన వచ్చింది. మంచిగా బ్రతకడం, తోటివారికి సాయపడడం మొదలెట్టాడు. కొడుకు పరివర్తనకి ఆనందంతో, ఆ రైతు గతంలో దొంగతనం చేసినప్పుడు కొట్టిన మేకుల్తో నిండిపోయిన గోడ నుండి ఒక్కొక్క మంచి పనికి ఒక్కొక్క మేకుని లాగేస్తూ ఉండేవాడు. ఒకరోజు ప్రెసిడెంట్‌గారి అమ్మాయి గొలుసుపోయిందని, స్టేషన్‌కి నువ్వు రావాలని పోలీసులు రావడంతో రైతుని కొడుకు నిలదీసాడు ''చూసావా నాన్నా? నేను మారినా ఈలోకం నన్ను తప్పు పడుతోంది'' అని. అందుకు ఆ రైతు ఆ కుర్రాడ్ని గోడ దగ్గరకి తీసుకువెళ్ళి చూపించాడు. ఆ గోడ మీద ఒక్క మేకు కూడా లేదు. కానీ కన్నాలున్నాయి. అదే చెప్పాడు. ''మేకులైతే తీసేసాను, కానీ ఆ రంధ్రాలు మూసుకుపోవడానికి టైం పడుతుంది'' అని.

''అందుకే చెప్తున్నాను రాజా! నువ్వు ఒకరికోసం బ్రతకొద్దు. నీకోసం నువ్వు జీవించు. సమాజాన్ని కొంతవరకే పట్టించుకోవాలి. వస్తాను. ఆఫీసుటైం అయిపోయింది'' అని చెప్పి బయటపడ్డాను. వాడికి ఆలోచించుకునే అవకాశం ఇస్తూ.

నా ఫీడింగ్ బాగా పనిచేస్తే వాడు త్వరలోనే మామూలు మనిషౌతాడు.

★

**టి.పి.హేమమాలిని**